

# మరో అడుగు

## - డా.వేదుల సుభద్ర



(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

పడుకున్నదన్నమాటే కానీ, ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా? అని ఎదురుచూడ్డంతోనే గడిచింది రాధిక కి.

తెల్లవారుతూనే తనే డాక్టర్ రాజేష్ ఆఫీస్ కి ఫోన్ చేసింది.

"పది గంటలకల్లా వచ్చేస్తారు మేడం, మొదటి టోకెన్ మీకే ఇస్తాను, పదిగంటలకి పదినిమిషాల ముందు వచ్చేయండి" అంది డాక్టర్. రాజేష్ పర్సనల్ అసిస్టెంట్ దుర్గ.

పదిగంటలకు డాక్టర్ ఎదురుగా కూర్చుని ఉన్నారు రాధిక, కిరణ్, స్వప్నిక.

" నాలుగైదు సార్లు గట్టిగా ఊపిరి తీసుకుని, వదలమంటూ స్టెతస్కోప్ ని స్వప్నిక ఛాతీమీద పెట్టి చూశాడు రాజేష్.

లింఫ్ నోడ్స్ ని ( Lymph Nodes) (శోషరసగ్రంధులు) పరీక్షించసాగాడు.

చిన్నచిక్కుడు గింజల్లా శరీరమంతా ఉం డే ఆ గ్రంధులు మానవశరీరానికి బాక్టీరియా, వైరస్ ల లాంటి వల్ల వచ్చే ఇన్ ఫెక్షన్స్ నుంచి రక్షణ ఇచ్చేవి. రోగ నిరోధ వ్యవస్థ లో ముఖ్య పాత్ర వహిస్తాయి.

అందుకే పరీక్షిస్తున్నాడని రాధిక కీ, కిరణ్ కీ అర్థం అయింది.

" నాలిక చాపు తల్లీ" నెమ్మదిగా అన్నాడు.

తెరచిన స్వప్ని బుగ్గలు పట్టుకుని చిన్న పరికరంతో నాలిక ను క్రిందకి వత్తి టార్చ్ లైట్ గొంతులోకి వేసి చూశాడు.

ఆయన ఎప్పటిలా ఉత్సాహంగా ఉన్నట్టుగా అనిపించలేదు రాధిక కి.అలా అనుకుంటేనే ఆమెకి ఏ దోలా అనిపించింది.

కిరణ్ మాత్రం మామూలుగానే ఉన్నాడు.

"శోషరస గ్రంధులు కొద్దిగా వాచాయి. అందుకే ఈ జ్వరం, ఇన్ ఫెక్షన్. గొంతు నొప్పిగా ఉందని అంది కదా,దానికీ అదే కారణం. అంతకంటే పెద్దగా కంగారు పడాల్సింది ఏమీలేదు. అవర్ ఛాంపియన్ విల్ బీ బెటర్ సూన్. అంతే" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

ఆ నవ్వులోనూ, ఆ మాటలోనూ కూడా ఏదో లోపించినట్టు అనిపించింది రాధిక కి.

కానీ బయటకి ఏమీ అనలేకపోయింది.

" కొద్దిగా హీమోగ్లోబిన్ లెవెల్ కూడా తక్కువగా ఉన్నట్టనిపిస్తోంది. అందుకే నీరసం. మరో 2-3 రోజులు రెస్ట్ తీసుకుని, బలవర్ధకమైన ఆహారం తీసుకుంటే చాలు" అంటూ,

"ఎందుకైనా మంచిది ఒక చిన్న బ్లడ్ టెస్ట్ చేయి ద్దాం, విషయం తెలుస్తుంది" అన్నాడు రాజేష్.

'బ్లడ్ టెస్ట్' అనగానే ఉలిక్కిపడింది స్వప్ని.

" బ్లడ్ టెస్టా? వద్దంకుల్. మీకు తెలుసు గా, సూదులన్నా, ఇంజెక్షన్ అన్నా నాకస్సలు ఇష్టం ఉండదని. " అంది కంగారుగా.

పెద్ద కళ్ళనిండా కంగారు నిండగా ఆమె అన్న మాటలని చూసి నవ్వాడు డా.రాజేష్.

" బ్లడ్ టెస్ట్ అంటే ఇంజెక్షన్ కాదుగా తల్లీ, ఒక్క చిన్న ప్రిక్. ఇలా గుచ్చి, అలా కొంచం బ్లడ్ తీసుకుని, ఆపైన స్టికర్ వేసి పంపించేస్తారు. అంతే" అన్నాడు.

నవ్వడానికి ప్రయత్నించింది స్వప్నిక.

"నాకు నీడిల్ అంటే చాలా భయం అంకుల్. వేయించుకోవలసిన ప్రతీసారీ ఎంత భయపడేదాన్నో.

థాంక్ గాడ్! అమ్మ నా చెవులు నా చిన్నప్పుడే కుట్టించేసింది గానీ లేకపోతే నేనెప్పుడూ కుట్టించుకునేదాన్ని కాదేమో. ఐ డోంట్ నో వై, బట్ ఐ హేట్ నీడిల్స్. " అంది..

తన చెవి రింగును చేత్తో తాకుతూ ఆమె అన్న మాటలకి గట్టిగా నవ్వకుండా ఉండలేకపోయాడు డాక్టర్ రాజేష్.

“వెరీ ఫన్నీ, అలా ఏమీ కాదు” అన్నాడు.

ఆయన చెప్పేది తన మంచికే కనుక, మరేమీ అనడానికి ఆస్కారం లేదు కనక మాట్లాడకుండా కూర్చుంది.

" అయినా ఛాంపియన్ లకి కూడా భయంగా ఉంటుందా? ఎవరైనా వింటే నవ్వరూ? చిన్న ప్రిక్ అంతే కదా. ఛీర్ అప్ నౌ" అని స్వప్నిక తో చెప్పి,

" పక్కనే ఉన్న.ఆర్.ఎల్ లాబ్ లో చెయించండి కిరణ్!, వాళ్ళయితే రిపోర్ట్ నాకే డైరెక్ట్ గా పంపించేస్తారు. మీరు మళ్ళీ ప్రత్యేకంగా వెళ్ళక్కర్లేదు. మరో నాలుగురోజులకి మీరు చెకప్ కి వచ్చినప్పుడు చెప్తాను, అంతగా అవసరం అనుకుంటే ఫోన్ చేస్తాను" " అన్నాడు.

బ్లడ్ టెస్ట్ అనగానే రాధిక కూడా భయపడింది, కానీ అది పైకి చెప్పలేదు.

ముగ్గురూ కలిసి దగ్గరలోనే ఉన్న జీ.ఆర్.ఎల్ లాబ్స్ కి వెళ్ళి బ్లడ్ టెస్ట్ చేయించుకున్నారు. అక్కడ నర్స్ నెమ్మదిగా, అస్సలు నొప్పి తెలియకుండా నీట్ సూది గుచ్చి నీట్ గా బ్లడ్ సాంపిల్ తీసుకుని, చిన్న చతురస్రాకారం లో ఉన్న బాండ్ ఎయిడ్ స్టిక్కర్ వేసింది.

" అనవసరంగా భయపడ్డాను నాన్నా, డాక్టర్ అంకుల్ చెప్పింది నిజమే, చాలా సింపుల్" అంది చిన్నగా నవ్వుతూ.

ఒక్కోసారి ఇలాంటి చిన్న సూది పొడుపు ఎన్నో విషయాలని వెలికి తీసుకువస్తుందో వారికి ఆ క్షణం లో తెలీదు.

మరో రెండు రోజుల తర్వాత, పొద్దున్నే డాక్టర్ రాజేష్ నించి రాధిక కి కాల్ వచ్చింది.

" మేడం, డాక్టర్ సార్ మాట్లాడతారు” అంటూ అసిస్టెంట్ దుర్గ చెప్పగానే రాధిక చెయ్యి వణికింది.

వెంటనే వచ్చి తనని కలవమని రాజేష్ చెప్పేసరికి ఆమె కి కాళ్ళూ, చేతులూ ఆడలేదు.

‘ఏమై ఉంటుంది? అని ఊహించడానికి కూడా ఆమెకి ధైర్యం రాలేదు.

ఎప్పుడూ నవ్వుతూ, పేషెంట్లని నవ్విస్తూ సుతారంగా, సులువుగా జబ్బులు తగ్గించే డాక్టర్ రాజేష్ ఇన్నేళ్ళలో ఒక్కసారి కూడా ఇలా ఫోన్ చెయ్యలేదు. పిల్లల విషయం లోనైనా, తమ విషయం లోనేఇనా ఒకటే తరహా.

ఏదైనా అవసరం అనుకుంటే ఫోన్ చేస్తాను అన్నారు, ఏమవసరం వచ్చి ఉంటుంది? మరో రెండు రోజుల్లో ఎలాగూ వెళ్ళాలి కదా!'

డాక్టర్ ని చూస్తేనే రోగం సగం తగ్గిపోవాలన్న దానికి ప్రతిరూపంగా ఉంటారాయన. అలాంటి ఆయన దగ్గరనించి ఫోన్ కాల్ రావడంతో ఆమెకి సహజంగానే కంగారు, భయం సమస్థాయిలో కలిగాయి.

వెంటనే కిరణ్ కి ఫోన్ చేసి విషయం చెప్పాలన్నది మాత్రమే ఆమెకి తోచింది.

అతను ఎప్పుడు వస్తాను అన్నది కూడా వినకుండానే, తన స్కూటర్ మీద ఎప్పుడూ లేనంత వేగంతో డాక్టర్ ఆఫీస్ కి చేరుకుంది.

" లాస్ట్ పేషెంట్ మేడం, ఐదునిమిషాలు ఆగితే లోపలకి పంపిస్తాను" అంది అసిస్టెంట్ దుర్గ.

చేసేదేమి లేక అక్కడే నిలబడింది రాధిక.

" కూర్చోండి మేడం" అన్నా ఆమె మాటల్ని విననట్టుగా కిటికీలోంచి బయటకు అభావంగా చూస్తూ ఉండిపోయింది.

మరో రెండు నిమిషాలకి కిరణ్ కూడా వచ్చాడు.

" కిరణ్" అంటూ గబ గబా వెళ్ళి అతని చేతులు పట్టుకుంది.

ఊరుకోమన్నట్టు కళ్ళతోనే అనునయించాడు కిరణ్.

ఆతర్వాత రెండు నిమిషాలసేపు ఇద్దరూ అలాగే ఉండి పోయారు," మరో పదినిమిషాల్లో పిలుస్తానన్నారు సార్ " అంటూ దుర్గ చెప్పేవరకూ.

పేషెంట్లనందరినీ చూసి పంపేసిన డాక్టర్ రాజేష్ తన చేతిలో స్వప్నిక తాలూకా బ్లడ్ రిపోర్ట్ ని మరోసారి పరిశీలించసాగాడు.

కంప్లీట్ బ్లడ్ టెస్ట్, బ్లడ్ స్మియర్ టెస్ట్ రిపోర్ట్ లు అతని ఎదురుగా టేబిల్ మీద ఉన్నాయి. స్వప్నిక పేరు పెద్ద అక్షరాలతో రాసి ఉన్న ఆ రిపోర్ట్ లు ఆయనని కలవరపరిచాయన్నది వాస్తవం.

ఆ రిపోర్ట్ ల నిండా ఉన్న ఎర్ర రక్తకణాలు, తెల్లరక్తకాణాలు, ప్లేట్ లెట్ల కి సంబంధించిన నంబర్లూ, వాటి ఆకారాల తాలూకా వివరాలూ ఉన్నాయి.

పేషెంట్ రక్త నమూ నాలలో ఏమాత్రం తేడాలున్నా తెలిపే ఆ పరీక్షా ఫలితాలు ప్రస్తుతం ఏమాత్రం ఆశాజనకంగా కనిపించలేదు.

స్వప్నిక రక్తంలో పెరిగిన తెల్ల రక్తకణాలు, తక్కువగా కనిపిస్తున్న ఎర్ర రక్త కణాలూ ఆయనని కంగారు పెట్టాయి.

స్వప్నికనెంతో అభిమానించే, ఆ కుటుంబానికి ఆప్తుడిగా కాక, ఒక డాక్టర్ గా ఆలోచించి, విశ్లేషించడానికి ప్రయత్నించాడు.

అనుకోని ఫలితాలు ఇవి.

కారణమేమయి ఉంటుంది? అంతుపట్టలేదు అతనికి.

ఈ ఒక్క పరీక్షతోనూ ఎలా నిర్ధారణకి రావడం?

మరిన్ని పరీక్షలు చేయిస్తే కనీసం ఈ ఫలితాలకి కారణం అర్థం అవుతుంది. ఏం చెయ్యాలి?' ఇలా సాగుతున్నాయి ఆయన ఆలోచనలు.

డయాగ్నస్టిక్ సెంటర్ లో జరిగిన పొరపాటవవచ్చా?

కేవలం రక్తం తక్కువగా ఉండడం వలన ఇలా జరిగిందా? స్వప్నిక ఎనీమిక్ గా ఉందేమో? అంతకన్నా ఇంకేమీ లేదేమో? తనే అనవసరంగా ఎక్కువగా ఆలోచిస్తున్నాడా?

ఇలా ఎంత సమాధానపరుచుకోవాలనుకున్నా ఆయన మనసు మాత్రం ఏదో తెలియని కీడు శంకిస్తూనే ఉంది.

తన స్నేహితులెవరికైనా ఫోన్ చేసి ఒకసారి అడిగితేనో? లేదా మరోసారి బ్లడ్ టెస్ట్ చేయిస్తే? మరొకసారా, మరొకచోటా? చేయిస్తే ఏమైనా మారుతుందా?

ఇలా ఒక వావీ వరసాలేని ఆలోచనలు ఆయన మనసులో జోరీగల్లా ముసురుకున్నాయి.

తన చేతుల్లో ముఖం దాచుకుని కూర్చుండి పోయాడు కొన్ని నిమిషాలు.

కిరణ్ ని, రాధిక ని లోపలకి దుర్గ లోపలికి పంపుదామనుకునేలోపు, డాక్టర్ స్నేహ భర్తని కలవడానికి వచ్చింది.

"హలో కిరణ్, రాధీ అంటూ వీళ్ళని పలకరించి, రాజేష్ కోసం వెయిట్ చేస్తున్నారా? మీరు వెళ్ళండి, నేను ఆగుతాను" అంది.

“అరే, పరవాలేదు డాక్టర్, మీరు కలిసి రండి. మేము వెయిట్ చేస్తాం. డా.రాజేష్ రమ్మన్నారంటే వచ్చాం. స్వప్ని ఇంట్లోనే ఉంది, బానే ఉంది " అన్నాడు కిరణ్.

" సారీ, రెండే నిమిషాల్లో వచ్చేస్తాను" అంటూ లోపలకి వెళ్ళిందావిడ.

" రాజా,” అంటూ వచ్చిన స్నేహ అతను కూర్చున్న భంగిమని చూసి " ఏమయింది రాజా? ఆర్ యూ ఓకే?" అంటూ దగ్గరకు వచ్చింది.

డాక్టర్ వృత్తి అంటే ఎంత సున్నితమైనదో, ఎన్ని భావోద్వేగాలకు లోను చేస్తుందో ఆమెకు తెలియనిది కాదు. ఒక డాక్టర్ గా ఆమెకీ ఇవన్నీ అనుభవమే.

“ఇంత సున్నితం గా ఉంటే మన పని చెయ్యడం కష్టం కదా డాక్టర్ సాబ్!” అంటూ భర్తని తరచుగా ఆటపట్టిస్తూనే ఉంటుంది.

“అందుకే ఈ జనరల్ ఫిజీషియన్ అవతారం కదా. జలుబులూ, జ్వరాలు తప్ప పెద్ద జబ్బులేమీ చూడక్కరలేదు కదా అని.” అంటూ చిరునవ్వు నవ్వే భర్తని అలా చూసేసరికి ఆమె కొద్దిగా కంగారు వేసింది.

ఆమె గొంతు విని నెమ్మదిగా తల ఎత్తి చూశాడు డా. రాజేష్.

"ఏమైంది రాజా? వంట్లో బాగోలేదా?" అంది.

" స్వప్ని, స్వప్నిక. రిపోర్ట్స్" అన్నాడు

"ఒక్క నిమిషం, లెట్ మీ కాల్ డాక్టర్.సుజిత్.” అంటూ ఫోన్ చేతిలోకి తీసుకున్నాడు.

ఆయన ఫోన్ మాట్లాడుతూ ఉండగానే స్వప్నిక రిపోర్ట్ లన్నింటినీ పరిశీలించింది డా.స్నేహ.

ఆమెకి అర్థం అయింది భర్త ఆందోళనకి కారణం. స్వప్నిక రక్తంలో ఉన్న ఇమ్మెచ్యూర్ తెల్లరక్తకణాలు.

"డాక్టర్ సుజిత్ దొరికారా? ఏమన్నారు?" అంది స్నేహ భర్త వైపు చూస్తూ.

"లేదు, కాన్ ఫరెన్స్ కి వెళ్ళారుట, మరో రెండు గంటల్లో లాండ్ అవుతారుట, ఆ తర్వాత చేస్తే దొరుకుతారు అని చెప్పారు. ఫ్లైట్ లో ఉండి ఉండవచ్చు, అందుకే మొబైల్ ఫోన్ కి చేస్తే దొరకలేదు. హాస్పిటల్ కి చేస్తే చెప్పారు" అన్నాడు నెమ్మదిగా.

" ఇంకేం ఆప్షన్స్ ఉన్నాయి?" అంది స్నేహ.

" ప్రస్తుతానికి సుజిత్ కి ఫోన్ చేసి ఎక్స్పర్ట్ అభిప్రాయం తీసుకోవడం, ఈ ఫలితాలు తప్పని ఆశ పడడం. ఇవే మనకున్న ఉత్తమమైన ఆప్షన్స్." అన్నాడు

" అరే,. మర్చిపోయాను, కిరణ్, రాధికలని రమ్మన్నారుట కదా, బయట వేచి ఉన్నారు" అంది.

" అవును, రిపోర్ట్ గురించి చెబ్దామని రమ్మన్నాను, స్వప్ని రిపోర్ట్ గురించిన ఆలోచనల్లో పడి మర్చిపోయాను. నువ్వు రావడం కూడా మంచిదయింది. నెమ్మదిగా, వాళ్ళు భయపడకుండా ఎలా చెప్పాలా? అనుకుంటున్నాను" అన్నాడాయన.

" ప్రస్తుతం ఉన్న విషయం సున్నితంగా చెబ్దాం, సుజిత్ తో మాట్లాడితేనే కదా మనకైనా క్లారిటీ వచ్చేది" అంది స్నేహ.

అవునన్నట్టు తల ఊపాడు ఆయన.

లోపలేం జరుగుతోందో తెలియక క్షణమొక యుగంగా బయట నిలబడి, నిరీక్షిస్తున్నారు కిరణ్, రాధిక..

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments